క్లుప్తంగా

ఎమ్మెల్సీకి వినతి



శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీకి అంబులెన్స్ మంజూరు చేయాలని కోరుతూ శనివారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డికి మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణ వినతిపత్రం అందజేశారు. వడ్డేపల్లికి గతంలో మంజూరైన అంబులెన్స్ నిత్యం మరమ్మతులకు గురవుతోందని, అత్యవసర పరిస్థితుల్లో మొరాయిస్తుందని తెలిపారు. రాజోళి, ఇటిక్యాల, వడ్డేపల్లి మండలాల ప్రజలకు ఒకే అంబులెన్స్ ఉందని, కొత్త అంబులెన్స్ మంజూరు చేయాలని కోరారు. చైర్‌పర్సన్ వెంట శ్రీను, మధు, ఉదయ్ ఉన్నారు.

వాహనాల తనిఖీ



కేటీదొడ్డి: మండలం కేంద్రంలో శనివారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకటేష్ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. మద్యం తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రోడ్డు నిబంధనలు పాటించని వాహనదారులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. వాహనాల తనిఖీలో ఎస్ఐ జక్కిబాబు, రజనీబాబు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఫీవర్ సర్వే

అలంపూర్ రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం క్యాతూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యసిబ్బంది ఇంటింటికెళ్లి జ్వరంతో బాధపడుతున్న వారికి మందులను పంపిణీ చేశారు. అదేవిధంగా చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పు చేయించుకోవాలని సూచించారు.

కిష్టాపురం గ్రామస్తుల నిరసన

అయిజ: మండలంలోని కిష్టాపురం రోడ్డు అధ్వానంగా మారినా మరమ్మతు చేయకపోవడంపై గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం రాత్రి ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ కిష్టాపురం మీదుగా వెళ్తుండగా.. గ్రామస్తులు కారును నిలిపి తమ గోడును వెల్లబోసుకున్నారు. రోడ్డు మొత్తం గుంతలమయంగా మారడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. భారీ వాహనాల రాకపోకలతో రోడ్డు మరింత ధ్వంసమవుతుందని తెలిపారు. రోడ్డు మరమ్మతుకు కృషి చేయాలని ఏఐసీసీ కార్యదర్శిని కోరారు.

డీఎస్పీ, సీఐకి సన్మానం



గట్టు: గద్వాల డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ శ్రీనివాస్‌ను శనివారం సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు బల్గెర హన్మంతునాయుడు సన్మానించారు. జిల్లా కేంద్రంలో పోలీసు అధికారులను మర్యాద పూర్వకంగా కలిశారు. శాంతి భద్రతల పరిరక్షణకు తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు.

ఎస్ఐకి సన్మానం

శాంతినగర్: మండల ఎస్ఐగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ నరేష్‌ను శనివారం మండల ప్రజాప్రతినిధులు శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కాశపోగు రాజు, ఎంపీపీ రజిత, శ్రీనివాస్‌గౌడ్, వెంకటేశ్వర్‌రెడ్డి, రాజు, మహేష్, శేఖర్, రత్నం, మోహన్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ఉండవెల్లి: గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని సీఐటీయూ మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ట్యాంకర్లతో సరఫరా చేసే నీరు సరిపోవడంలేదని, సమస్య పరిష్కారానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో హమాలీ వెంకట్రాముడు, ఆటో దేవరాజు, శివ, సూరి ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలం వల్లూరుకు చెందిన టీచర్ శాంసన్ కోడలు కల్యాణి అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ యూత్ నాయకుడు ఆర్.కిశోర్ శనివారం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ముందుగా కల్యాణి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట వెంకట్రాములు, హుస్సేన్, విజయ్, మణిదీప్ ఉన్నారు.



మల్దకల్ మండలం సద్దలోనిపల్లిలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి



రాజోళిలో పీర్ల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



అలంపూర్‌లో..

కనులపండువగా మొహర్రం

- మతసామరస్యానికి ప్రతీకగా వేడుకలు
- ఉత్సాహంగా పీర్ల ఊరేగింపు
- ఆడి పాడిన యువత
- జనసంద్రమైన పల్లెలు
- దట్టీలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్న భక్తులు



మానవపాడు మండలం అమరవాయిలో పీర్ల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

అలంపూర్ రూరల్: మొహర్రం వేడుకలను శనివారం కనులపండువగా నిర్వహించారు. వేడుకల్లో కులమతాలకు అతీతంగా పాల్గొని మతసామరస్యాన్ని చాటారు. పట్టణంలోని అలెక్బర్, గంధం, పెద్ద లాలీసాబ్, భైరంపల్లి లాలీసాబ్, ఇమాం ఖాసీం, పెద్ద ఇమాంఖాసీం, గాజుల పీరు, కట్టెల పేట పీర్ల ఊరేగింపు ఆకట్టుకుంది. భక్తులు దట్టీలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పురవీధుల్లో పీర్ల ఊరేగింపు అనంతరం తుంగభద్ర నదిలో నిమజ్జనం చేశారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఆర్.గార్లపాడు, పుటాన్‌దొడ్డి, కోదండాపురం, సాసనూలు, సాతర్ల, వేముల, మునుగాల, చాగాపురం, వల్లూరు తదితర గ్రామాల్లో మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆర్.గార్లపాడులో మద్దెలబండ ఉస్సేన్‌షాబ్ పీరును దర్శించుకునేందుకు వివిధ గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. పీర్లకు దట్టీలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం పీర్లను ఊరేగించి నిమజ్జనం చేశారు. ఊరేగింపులో యువత ఉత్సాహంగా పాల్గొని ఆడి పాడారు.

మల్దకల్: మండలంలోని సద్దలోనిపల్లిలో మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు. చావిడి నుంచి పీర్లను పురవీధుల్లో ఊరేగించి బావిలో నిమజ్జనం చేశారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పీర్లను దర్శించుకున్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రంతోపాటు తక్కశీల, కంచుపాడు, మారమునగాల, ప్రాగటూరు, మెన్నిపాడు గ్రామాల్లో కొలువుదీరిన పీర్లను ఊరేగించి బావుల్లో నిమజ్జనం చేశారు.

రాజోళి: మండల కేంద్రంలో మొహర్రం పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించారు. కులమతాలకు అతీతంగా ఉత్సవాల్లో పాల్గొన్నారు. పీర్లకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

మానవపాడు: మండలంలోని పలు గ్రామాల్లో మొహర్రం వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ముస్లింలు ఉపవాసదీక్ష చేపట్టి మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. డప్పుచప్పుళ్లు, ఆటపాటల మధ్య పీర్లను ఊరేగించి నిమజ్జనం చేశారు.

గట్టు: మండల కేంద్రంలో మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు. కమ్మరి వీధి మసీదు నుంచి పీర్ల ఊరేగింపు నిర్వహించి నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.



ఉండవెల్లిలో..



ఇటిక్యాల మండలం మునుగాలలో..



గట్టులో పీర్ల ఊరేగింపు

ఘనంగా పండుగ సాయన్న జయంతి



గద్వాలలో పండుగ సాయన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ముదిరాజ్ నాయకులు

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని ముదిరాజ్ మత్స్యకార సంఘం కమ్యూనిటీహాల్‌లో శనివారం పండుగ సాయన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ముదిరాజ్ మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహులు మాట్లాడుతూ పాలమూరుకు చెందిన భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన మహనీయుడు పండుగ సాయన్న అని కొనియాడారు. ఆయన జీవిత చరిత్రను అందరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జనార్దన్, లక్ష్మన్న, దౌలు, శ్రీను, పాండు, వంట భాస్కర్, శ్రీనివాసులు, నర్సింహులు, చిరు, మధు తదితరులు పాల్గొన్నారు.

ధరూరు: మండల కేంద్రంలోని వైఎస్సార్ చౌరస్తాలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో పండుగ సాయన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్, కన్వీనర్ బుచ్చిబాబు, గోవిందు, బలరాంనాయుడు, ఆంజనేయులు, కృష్ణ, ప్రేంరాజ్, లక్ష్మన్న, గోపాల్, మీసాల కిష్టన్న, ఆశన్న, వెంకట్రాములు, రమేష్, భూపతినాయుడు, నేతన్న పాల్గొన్నారు.



అయిజలో సాయన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీఎస్పీ నాయకులు

అయిజ: మండల కేంద్రంలో పండుగ సాయన్న జయంతి వేడుకలను బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కేశవరావు మాట్లాడుతూ నాటి తెలంగాణ దొరలు దోచుకున్న సొమ్మును తిరిగి ప్రజలకు పంచిన ఘనత పండుగ సాయన్నకే దక్కిందన్నారు. ఆయనను అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, నియోజకవర్గ ఇంచార్జ్ మధుగౌడ్, స్వామిదాసు, చిన్నా, వెంకటేశ్వర్లు, వీరన్న, రవి, ప్రకాష్, వినోద్‌కుమార్, నర్సింహ పాల్గొన్నారు.

బురదమయంగా మారిన రోడ్డుపై నాట్లు



మాన్‌దొడ్డిలో రోడ్డుపై వరినాట్లు వేస్తున్న గ్రామస్తులు

రాజోళి: మండలంలోని మాన్‌దొడ్డిలో బురదమయంగా మారిన రోడ్డుపై శనివారం గ్రామస్తులు వరినాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వర్షాలకు రోడ్డు మొత్తం బురదమయంగా మారడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. వెంకటాపురం స్టేజీ నుంచి ధన్వాడ వరకు రోడ్డు అధ్వానంగా మారిందని, మరమ్మతు చేయించాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని కోరారు.

మణిపూర్ హింసపై స్పందించకపోవడం సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న వాల్మీకి

గద్వాల అర్బన్: మణిపూర్ హింసపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పందించకపోవడం సరికాదని బహుజన రాజ్యసమితి అధ్యక్షుడు వాల్మీకి అన్నారు. జిల్లా కేంద్రంలోని పట్టణ ప్రకృతివనంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మణిపూర్‌లో ప్రజల ప్రాణాలకు భద్రత కరువైందన్నారు. అక్కడి సీఎం పెట్టుబడిదారులకు తొత్తుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. బీజేపీ పాలిత ప్రాంతాల్లో జాతుల మధ్య చిచ్చుపెడుతూ ఐక్యతను దెబ్బతీస్తున్నట్లు తెలిపారు. మణిపూర్‌లో శాంతిని నెలకొల్పేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బహుజన రాజ్యసమితి నాయకులు వినోద్‌కుమార్, కోళ్ల హుస్సేన్, దామోదార్, శివరాజ్, నాగన్న, కురుమన్న ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక



శాంతినగర్: రాజోళి మండలం పెద్ద ధన్వాడ గ్రామస్తులు శనివారం ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి ఆయన పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ఆంజనేయులుగౌడ్, మద్దిలేటి, రామన్‌గౌడ్, ప్రభాకర్, నర్సన్న తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దస్తగిరి, కుమార్, చిన్నతిమ్మప్ప, ఈరన్నగౌడ్, రాముడు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన కార్మికుల సమ్మె



శాంతినగర్: పంచాయతీ కార్మికుల సమ్మె శనివారం కొనసాగింది. ఈ సందర్భంగా వడ్డేపల్లి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో చేపట్టిన సమ్మె శిబిరంలో పలువురు మాట్లాడుతూ పంచాయతీ కార్మికులను రెగ్యులరైజ్ చేయడంతోపాటు వేతనాలు పెంచాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

నేడు కార్యాలయం ప్రారంభం

ధరూరు: మండల కేంద్రంలో ఆదివారం నడిగడ్డ హక్కుల పోరాట సమితి కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్లు మండల అధ్యక్షుడు నెట్టెంపాడు గోవిందు శనివారం ప్రకటనలో తెలిపారు. పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్యక్రమానికి మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి, ఎస్‌డీఎఫ్ కోకన్వీనర్ పృథ్వీరాజ్‌యాదవ్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. మండల ప్రజలు, నడిగడ్డ హక్కుల సంఘం నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణ హామీని నిలబెట్టుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజేష్

గద్వాల అర్బన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో పెట్టి చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ పోగుల రాజేష్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఎమ్మార్పీఎస్ మండలస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. జడ్చర్లలో ఆదివారం మాదిగల విశ్వరూప సన్నాహక సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. సభకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ హాజరు కానున్నరని, జిల్లాలోని అన్ని మండలాల నుంచి ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్ అనుబంధ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో అశోక్, కన్నా, బుచ్చన్న, రంజిత్, పరుశరాం, శంకర్, కురుమన్న, గోపాల్, అంజి, నరేష్ ఉన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ఆదిశిలా క్షేత్రంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

మల్దకల్: మండలంలోని ప్రసిద్ధ ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలోని స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి, సద్దలోనిపల్లి కృష్ణస్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్ప, శేషంపల్లి శివసీతారామస్వామి, చర్లగార్లపాడు వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు రమేష్ ఆచారి, మధుసూదనాచారి, రవిచారి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి సహకరించాలి..

ఆదిశిలా క్షేత్రంలో చేపట్టే అభివృద్ధి పనులకు దాతలు సహకరించాలని ఆలయ సంస్థ చైర్మన్ ప్రహ్లాదరావు, ఈఓ సత్యశ్చంద్రారెడ్డి కోరారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. దాత ర్యాలంపాడు నర్సింహులుగౌడ్ అందజేసిన రూ.5లక్షలతో ఆలయంలో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. సమావేశంలో మధుసూదన్‌రెడ్డి, సీతారామిరెడ్డి, చంద్రశేఖర్‌రావు, బాబూరావు, ఉరుకుందు, శ్రీను, రంగస్వామి, శివమ్మ, కృష్ణ ఉన్నారు.

ఇదేం రోడ్డురా బాబు!



గద్వాల- జూరాల రోడ్డులో సగభాగం మాత్రమే నిర్మించిన సీసీ

- గుంతలమయంగా జూరాల రోడ్డు
- ఒకవైపు సీసీరోడ్డు.. మరోవైపు గుంతలు
- జూరాల సందర్శకులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు

ధరూరు: జూరాల పేరు వింటేనే మనకు చటుక్కున గుర్తుకు వచ్చేది కృష్ణమ్మ అందాలు.. వరద పొంగులు.. ఆహ్లాదకర వాతావరణం. వరదల సమయంలో ప్రాజెక్టుకు వివిధ ప్రాంతాల నుంచి జనం భారీగా తరలివస్తుంటారు. సందర్శకులతో ప్రాజెక్టు ప్రాంతం కిటకటలాడుతోంది. అయితే రోడ్ల పరిస్థితి చూస్తే వద్దురా బాబో జూరాల అన్నట్లు ఉంటోంది. గుంతలమయంగా మారిన రోడ్డుపై రాకపోకలు సాగించలేక అవస్థలు పడాల్సి వస్తోంది. కొన్నేళ్లుగా జూరాల ప్రాజెక్టు నుంచి నర్సన్‌దొడ్డి చౌరస్తా, చింతరేవుల గ్రామాలకు వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. రోడ్డు నిర్మాణాలపై దృష్టి సారించాల్సిన పీజేపీ అధికారులు.. పనుల పేరుతో కాంట్రాక్టర్ల ద్వారా వచ్చే కమీషన్లకు కక్కుర్తిపడి రోడ్లను పట్టించుకోవడంలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మోకాలి లోతు గుంతలతో నిత్యం వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్న 12 ఫీట్ల రోడ్డులో సగం వరకు మాత్రమే సీసీరోడ్డు నిర్మించి.. మిగతా రోడ్డును వదిలేయడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. సీసీ వేయని వైపు గుంతల్లో వర్షపునీరు నిలవడంతో రోడ్డు ఎక్కడ బాగుందో తెలియని పరిస్థితి నెలకొంది.

సందర్శకులకు తప్పని తిప్పలు..

ఎక్కడెక్కడి నుంచో జూరాల ప్రాజెక్టు చూసేందుకు వచ్చే సందర్శకులు ఇటువైపు ఎందుకొచ్చామనే విధంగా రోడ్లు మారాయి. ఇక్కడికి రావడమంటే కోరి కష్టాలను కొని తెచ్చుకున్నట్లేనని వాహనదారులు అభిప్రాయపడుతున్నారు. చిన్నపిల్లలు, కుటుంబ సభ్యులతో కలిసి వచ్చే వారు గతుకుల రోడ్లపై ప్రయాణించలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. వాహనం ఏ మాత్రం మొరాయించినా.. గోతుల్లో కూరుకుపోయినా వారి కష్టాలు చెప్పడం వర్ణనాతీతం. ఇప్పటికైనా రోడ్లను బాగు చేయాలని జూరాల సందర్శకులు కోరుతున్నారు.

ముందస్తు చర్యలు శూన్యం..

జిల్లా కేంద్రం నుంచి నిత్యం వందలాది వాహనాలు జూరాల ప్రాజెక్టు మీదుగా నారాయణపేట, మక్తల్, అమరచింత, ఆత్మకూరు, మరికల్, దేవరకద్ర తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటాయి. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రెండువైపులా సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసి ఉంటే అవస్థలు తప్పేవని వాహనదారులు పేర్కొంటున్నారు. అధికారులు ముందస్తు చర్యలు చేపట్టకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్లు బాగు చేయాలి..



మాది గద్వాల పట్టణం. జూరాలకు నీళ్లు వచ్చాయంటే చూడటానికి స్నేహితులతో కలిసి వచ్చాను. రోడ్లు చాలా అధ్వానంగా ఉన్నాయి. గుంతలమయంగా మారిన రోడ్లపై ఎలా ప్రయాణించాలో తెలియడం లేదు. సుదూర ప్రాంతాల నుంచి జూరాల సందర్శనకు చాలామంది వస్తుంటారు. సందర్శకులకు ఇబ్బందులు కలుగకుండా రోడ్లను బాగు చేయాలి.

– మహబూబ్, గద్వాల

కంపచెట్లు తొలగించాలి..



జూరాల ప్రాజెక్టుకు ప్రతి ఏటా వస్తుంటాం. ఇక్కడికి వస్తే వసతులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. జూరాలకు వచ్చే రోడ్డు గుంతలమయంగా మారడం, మరోవైపు ప్రాజెక్టుపై రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు ఉండడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఏ మాత్రం ఆదమరిచి వెళ్లినా ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. ముళ్ల పొదలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలి.

– షబ్బీర్, గద్వాల

త్వరలో రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తాం..

45 రోజుల కిందట సీసీరోడ్డు నిర్మాణ పనులు చేపట్టాం. ట్రాఫిక్ సమస్య కారణంగా ఒకవైపు సీసీరోడ్డు వేశాం. రోడ్డు నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించి దాదాపు రూ.8లక్షలతో పనులను ప్రారంభించారు. వర్షాలు కురుస్తుండడంతో పనులకు అడ్డంకిగా మారింది. సీసీరోడ్డు పనులను త్వరలోనే పూర్తి చేస్తాం.

– జుబేర్ అహ్మద్, ఈఈ, పీజేపీ

సమావేశాన్ని విజయవంతం చేయండి



జిల్లా కేంద్రంలో మాట్లాడుతున్న రంజిత్‌కుమార్

గద్వాల అర్బన్/కేటీదొడ్డి: తెలంగాణలో సదువు ఎట్లుంది.. ఎట్లుండాలె అనే అంశంపై ఆదివారం జిల్లా కేంద్రంలోని పరివార్ ఫంక్షన్‌హాల్‌లో సమావేశం నిర్వహించనున్నట్లు నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి సోషల్ డెమొక్రటిక్ ఫోరం రాష్ట్ర కన్వీనర్, రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి, ఎస్‌డీఎఫ్ కోకన్వీనర్ సంగంరెడ్డి పృథ్వీరాజ్‌యాదవ్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. మేధావులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అదేవిధంగా కేటీదొడ్డి మండలం పాతపాలెంలో నిర్వహించిన మొహర్రం వేడుకల్లో రంజిత్‌కుమార్ పాల్గొని దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో కన్వీనర్ బుచ్చిబాబు, తిమ్మప్ప, ప్రేమ్‌రాజ్, వెంకట్రాములు, గోపాల్, అంజి, బీమన్నగౌడ్, దస్తగిరిగౌడ్ పాల్గొన్నారు.